సాక్షి నల్లగొండ

బుధవారం : 20 : సెప్టెంబర్ : 2023



దంపతుల దుర్మరణం

నల్లగొండ పట్టణ శివారు పానగల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు దుర్మరణం చెందారు. - 8లో



చైన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్

చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. భువనగిరి డీసీపీ వివరాలు వెల్లడించారు. - 8లో



అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం

అన్ని వర్గాల ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. - 8లో

న్యూస్‌రీల్

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీంతో మంగళవారం అధికారులు ప్రాజెక్టు ఒక గేటును పైకెత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటికీ ఎగువ ప్రాంతాల నుంచి మూసీలోకి 944 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 645 అడుగుల (4.46 టీఎంసీలు) గరిష్ట నీటి మట్టం గల మూసీ రిజర్వాయర్‌లో నీటిమట్టం 644 అడుగుల (4.20 టీఎంసీలు) వద్ద ఉంది. ప్రాజెక్టులో నీటిమట్టం గరిష్టస్థాయికి చేరువలో ఉండడంతో అధికారులు ప్రాజెక్టు ఒక క్రస్ట్ గేటును అడుగు పైకెత్తి 354 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ కాల్వలకు 508 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నుంచి మొత్తం 944 క్యూసెక్కుల నీరు విడుదలవుతోందని అధికారులు పేర్కొన్నారు.

అంగన్‌వాడీల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

- గ్రామాల్లో కార్యదర్శులకు, పట్టణాల్లో మెప్మా ఆర్పీలకు నిర్వహణ బాధ్యత



పౌష్టికాహారం తీసుకుంటున్న మహిళలు

నల్లగొండ : అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మెలో ఉండడంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీలో ఇబ్బందులు ఏర్పడకుండా కేంద్రాల నిర్వహణను గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులకు, పట్టణాల్లో మెప్మా రిసోర్స్ పర్సన్లకు అప్పగించనున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్డీఓ, డీపీఓ, డీఎంహెచ్ఓ, మెప్మా పీడీ సమన్వయంతో పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. మూతబడిన 994 అంగన్‌వాడీ కేంద్రాలను ఒక్కొక్కటిగా స్వాధీనం చేసుకుని పంచాయతీ కార్యదర్శులు, వీఓఏ, ఆశ కార్యకర్తలు, ఆర్పీలతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేసి పౌష్టికాహారం అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. టేక్ హోం రేషన్‌గా 15 రోజులకు సరిపడా పౌష్టికాహారాన్ని పంపిణీ చేయనున్నారు. పూర్వ ప్రాథమిక విద్యకు ఇబ్బందుల తలెత్తకుండా టీశాట్ లింక్‌కు తల్లిదండ్రులకు షేర్ చేస్తున్నారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

నార్కట్‌పల్లి : విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని డీఈఓ బొల్లారం భిక్షపతి అధికారులకు సూచించారు. మంగళవారం మండలంలోని అమ్మనబోలు, అక్కెనపల్లి, నెమ్మాని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ (తొలిమెట్టు) ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అక్కెనపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీలు మెనూ పాటిస్తున్నాయా, రాగి జావ ఇస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల హెచ్‌ఎంలు ఎస్.వెంకటేశం, ఏ.నీరజ, స్వృజనకుమారి ఉన్నారు.

చెవిలో పువ్వుతో నిరసన

నల్లగొండ : తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షల్లో భాగంగా మంగళవారం చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తిరందాసు సంతోష్ కుమార్ మాట్లాడుతూ విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్షా, కేజీబీవీ, యూఆర్ఎస్‌లలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని, మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, మహిళలకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను అమలు చేయాలని కోరారు. అనంతరం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని కలిసి తమ సమస్యను పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యాట వెంకట్, ఇటికాల రమేష్, లక్ష్మి, పగిడిపాటి ప్రవీణ్, కునుకుంట్ల కొండయ్య, అంబర్ల సత్యనారాయణ, మోలుగురు క్రిష్ణ, చాడోజు శ్రీధర్, కొండ చంద్రశేఖర్, బొమ్మరబోయిన సైదులు, చరక వెంకట క్రిష్ణ, చింతరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, శంకర్, జహంగీర్, సైదులు, గన్నెబోయిన లింగయ్య, ఇద్దయ్య, ధనలక్ష్మి, ప్రవళిక, నాగమణి పాల్గొన్నారు.



కొలువుదీరిన గణనాథులు

- జిల్లాలో 7,120 మండపాల ఏర్పాటు
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ నిఘా

నల్లగొండ క్రైం : గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మికత వాతావరణంలో ప్రారంభమయ్యారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో గణనాథులు కొలువుదీరారు. జిల్లా వ్యాప్తంగా 7,120 మండపాలను ఏర్పాటు చేసినట్లు పోలీస్ అధికారులు పేర్కొన్నారు. ఎన్నికల సమయం కావడంతో యువతను ఆకట్టుకునేందుకు రాజకీయ పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో విగ్రహాలను పంపిణీ చేశారు. దీంతో ప్రతి గ్రామంలో కనీసం మూడు కంటే ఎక్కువ సంఖ్యలో విగ్రహాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా కేవలం మండపాల ఖర్చు రూ.10 కోట్ల వరకు ఉంటుందని అంచనా. కనీసం ఒక్క మండపం ఏర్పాటుకు రూ.15 వేలు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఒక్క నల్లగొండ పట్టణంలోనే 493 విగ్రహాలను ఏర్పాటు చేశారు.

నిరంతరం పోలీస్ నిఘా..

వినాయక మండపాల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిరంతరం నిఘా ఉంచుతున్నారు. అన్ని మండపాలకు పోలీస్ శాఖ నుంచి అనుమతి ఇచ్చారు. అయితే ప్రజలకు ఇబ్బంది కలిగించేలా అర్ధరాత్రి దాటిన తర్వాత భారీ శబ్దం వచ్చేలా మైక్‌ల సౌండ్ ఉండొద్దని పోలీస్ శాఖ సూచించింది. మండపాల నిర్వాహకులు తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరింది. ప్రతి వినాయక మండపాన్ని తనిఖీ చేసే విధంగా పోలీస్‌శాఖ రూట్ మ్యాప్ సిద్ధం చెసింది. సమస్యాత్మకత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టింది. ఏదైనా సంఘనట జరిగితే వెంటనే ఘటనా స్థలానికి చేరుకునే విధంగా పోలీస్ శాఖ తగిన చర్యలు చేపట్టింది.

సెల్ఫీ విత్ గణేశ్



మీరు విఘ్నేశ్వరుడిని ప్రత్యేక ఆకృతుల్లో ప్రతిష్ఠించారా.. పర్యావరణాన్ని కాపాడే రీతిలో గానీ, ఏ అంశంపైనైనా సమాజానికి సందేశం ఇచ్చే రీతిలో మీ వినాయకుడు ఉన్నాడా.. మీ కాలనీల్లో, అపార్ట్‌మెంట్‌లలో ఏర్పాటు చేసుకున్న వినాయకుడు ఏదైనా స్పెషల్ గెటప్‌లో ఉన్నాడా.. అయితే, మీ వినాయకుడితో మీరు సెల్ఫీ తీసుకుని మాకు పంపితే.. ఆ ఫొటోలలో ఎంపిక చేసి ప్రచురిస్తాం.

మీరు సెల్ఫీ పంపాల్సిన వాట్సప్ నం. 99123 62784

రుణమాఫీ దక్కలే..!

రైతులకు శాపంగా.. అధికారుల తప్పిదాలు

- ఇద్దరు ముగ్గురు రైతులకు ఒకే ఆధార్, ఫోన్ నంబర్ పంపిన అధికారులు
- ఈ కారణంతో ఉమ్మడి జిల్లాలో 1536 మంది రైతులకు దక్కని 'మాఫీ'
- బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ రైతుల ప్రదక్షిణలు



ఈ ఫొటోలోని రైతు కందుకూరి జనార్దన్‌రెడ్డి. ఈ రైతు సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని పాలకవీడు పీఏసీఎస్‌లో ఎనిమిదేళ్ల క్రితం వ్యవసాయ రుణం తీసుకున్నాడు. ప్రభుత్వం విధించిన కటాఫ్ డేట్ ప్రకారం ఈ రైతుకు రుణం మాఫీ కావాల్సి ఉంది. కానీ ఈ రైతుకు అదే పీఏసీఎస్‌లో రుణం తీసుకున్న మరో రైతుకు సంబంధించిన ఆధార్, ఫోన్ నంబర్‌ను అధికారులు జాబితాలో పంపారు. దీంతో ఈ ఇద్దరు రైతులు ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీకి దూరమయ్యారు. ఇలా ఉమ్మడి జిల్లాలో అధికారుల తప్పిదాల వల్ల అర్హత ఉన్న రైతులకు మాఫీ అందలేదు.



తప్పుడు సమాచారం కారణంగా రుణమాఫీ పొందని రైతుల వివరాలు

జిల్లా	బాధిత రైతులు	మాఫీ కావాల్సిన మొత్తం (రూ.కోట్లలో)
నల్లగొండ	829	4.93
సూర్యాపేట	317	1.77
యాదాద్రి	390	2.30

నల్లగొండ అగ్రికల్చర్ : అధికారుల తప్పిదాల వల్ల అర్హత ఉన్న రైతులకు రుణమాఫీ దక్కలేదు. అధికారులు రుణమాఫీ జాబితా తయారు చేసే సమయంలో ఇద్దరు ముగ్గురు రైతులకు ఒకే ఆధార్, ఫోన్ నంబర్‌ను వేసి పంపడంతో ఈ సమస్య ఉత్పన్నమైంది. ఒకే సర్వే నంబర్‌పై పలువురు రైతులు పేర్ల కూడా పంపారు. ఇలాంటి సమస్య ఉన్న రైతులకు ఇప్పటికి రుణమాఫీ డబ్బులు జమకాలేదు. జూలై 26 నుంచి ప్రభుత్వం రుణమాఫీ డబ్బులను రైతుల రుణ ఖాతాల్లో జమ చేస్తోంది. అధికారులు చేసిన పొరపాట్ల కారణంగా కొందరు రైతులకు రుణమాఫీ కాకపోవడంతో వారంతా లబోదిబోమంటూ బ్యాంకులు, వ్యవసాయ అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

హడావుడిగా జాబితాల తయారీ..

2018 ఎన్నికల సమయంలో రైతులకు రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 2018 డిసెంబర్ 11 లోపు రూ.లక్షలోపు రుణాలు ఉన్న రైతుల జాబితాను పంపించమని ప్రభుత్వం బ్యాంకర్లను ఆదేశించింది. దీంతో బ్యాంకు అధికారులు హడావుడిగా రుణ గ్రహీతల జాబితాను తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులు ఈ జాబితాలను సరిచూసుకోలేదు. రెండు సంవత్సరాల క్రితం రూ.25 వేలలోపు రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. తిరిగి జూలై 26వ తేదీ నుంచి రూ.లక్షలోపు రుణమాఫీ చేస్తోంది. ఇప్పటి వరకు రూ.లక్ష వరకు ఉన్న రుణాలను మాఫీ చేసినప్పటికీ కొందరు రైతులకు మాఫీ అందలేదు. ఇదేమని రైతులు.. బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులను అడిగితే.. ఒకరిపై మరొకరు మాది తప్పు కాదంటే.. మాది తప్పు కాదని బదులిస్తున్నారు. మరికొన్ని చోట్ల బ్యాంకుల్లో సరి చేస్తారని చెబుతుండగా.. కొన్ని చోట్ల వ్యవసాయ అధికారులను సంప్రదించాలని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. తప్పులను సరిచేసి సరైన జాబితాను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి రుణమాఫీ అందేలా చూడాలని రైతులు వేడుకుంటున్నారు.

బ్యాంకుల్లో సరిచేయించుకోవాలి



ఏమైనా పొరపాట్లు జరిగి రుణమాఫీ కాని రైతులు ఆయా బ్యాంకుల్లో సరిచేయించుకోవడానికి ప్రభుత్వం అనుమతించింది. రైతులు వెంటనే సంబంధిత బ్యాంకులకు వెళ్లి జరిగిన పొరపాట్లను సరిచేయించుకుంటే వారికి రుణమాఫీ డబ్బులు రుణఖాతాలో జమ చేస్తారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ నల్లగొండ

కుటుంబ పాలనను అంతం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీడబ్ల్యూసీ సభ్యుడు లాల్‌జీ దేశాయ్ తదితరులు

- సీడబ్ల్యూసీ సభ్యుడు లాల్‌జీ దేశాయ్

నల్లగొండ: రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలనను అంతం చేయాలని ఆలిండియా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) సభ్యుడు లాల్‌జీ దేశాయ్ అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నివాసంలో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ విజయభేరి బహిరంగ సభలో సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ స్కీంలను ఇంటింటికి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందన్నారు. ప్రతి కార్యకర్త ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ హామీలను ప్రజలకు వివరిస్తే వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టాలని కోరారు. ఎన్నికలు వచ్చినప్పుడు బీజేపీ, ఎంఐఎం పార్టీలు తమకు బలంలేని చోట కూడా పోటీ చేస్తూ పరోక్షంగా బీఆర్ఎస్ పార్టీకి సహకరిస్తున్నాయని విమర్శించారు. కేసీఆర్ పాలనలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయని, నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కరువయ్యాయన్నారు. సీఎం కేసీఆర్ మోసపూరిత హామీలతో పాలన సాగిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. కర్ణాటక ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఏవిధంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయో తెలంగాణలో కూడా అదేవిధంగా కచ్చితంగా పథకాలు అమలు చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం నల్లగొండ పట్టణంలో ఇంటింటికి కాంగ్రెస్ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ గ్యారెంటీ కార్డు కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్, మహిళా అధ్యక్షురాలు భవాని, జెడ్పీటీసీ వంగూరు లక్ష్మయ్య, తిప్పర్తి మండల అధ్యక్షుడు జూకురి రమేష్, కనగల్ మండల అధ్యక్షుడు అనూప్‌రెడ్డి, కౌన్సిలర్లు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రజాకార్ సినిమాను నిషేధించాలి

మిర్యాలగూడ : బీజేపీ నాయకుల సారథ్యంలో విడుదలకాబోతున్న రజాకార్ సినిమాను నిషేధించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి కులం, మతం రంగు పూస్తున్నారని మండిపడ్డారు. పేదలు, భూస్వాముల మధ్య జరిగిన పోరాటాన్ని.. మతం మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం ఎన్నికల సమయంలో ఇలాంటి సినిమాలు విడుదల కావడం వల్ల ప్రజల్లో విభేదాలు వస్తాయని వెంటనే ఆ సినిమాను సెన్సార్‌బోర్డు నిషేధించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో మహిళా బిల్లును ప్రవేశపెట్టడం శుభపరిణామమని, సాకులు చూపి బిల్లు అమలు కాకుండా చేస్తే ఊరుకోమన్నారు. రాష్ట్ర యూనిట్‌గా దామాషా పద్ధతిలో ఎన్నికలు జరిపి పార్టీలకు వచ్చిన ఓట్ల ఆధారంగా సీట్లను కేటాయించాలన్నారు. దీని వల్ల ఎన్నికల వ్యయం పూర్తిగా తగ్గిపోతుందన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, ముడావత్ రవినాయక్, డాక్టర్ మల్లు గౌతంరెడ్డి, రాగిరెడ్డి రంగారెడ్డి, కందుకూరి రమేష్, లక్ష్మీనారాయణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

డిండి ఎత్తిపోతలపై స్పష్టత లేదు

- మట్టిమనిషి పాండురంగారావు
- సింగరాజుపల్లి రిజర్వాయర్ పరిశీలన

డిండి : డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించే రిజర్వాయర్లకు నీటిని తరలించడం, కాల్వ నిర్మాణం, ఆయకట్టుపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేనది మట్టిమనుషుల వేదిక నాయకుడు పాండురంగారావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిండి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసితుల స్థితిగతులను ఈనెల 17, 18, 19 తేదీల్లో మట్టి మనుషుల వేదిక ఆధ్వర్యంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు, రైతులు పరిశీలించారు. మంగళవారం సింగరాజుపల్లి రిజర్వాయర్ పనులను పరిశీలించిన అనంతరం పాండురంగారావు మాట్లాడారు. సింగరాజుపల్లి రిజర్వాయర్ పనుల్లో నాణ్యత లోపించిందన్నారు. రిజర్వాయర్ పనులు పూర్తయి నీటితో నింపితే గ్రామంలోని భూముల్లో నీటి ఊట దిగే ప్రమాదం ఉందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రిజర్వాయర్‌లో నీరు నిల్వ ఉండటంతో ఇప్పటి వరకే సింగరాజుపల్లి శివారులోని కొంతమంది రైతుల పొలాల్లో నీటి ఊటలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. ముంపునకు గురవుతున్న గ్రామాల ప్రజలకు భరోసా కల్పించకుండానే గుత్తేదారులు, పోలీసులతో దౌర్జన్యం చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో భూ నిర్వాసితులు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఆయన వెంట మానవ హక్కుల వేదిక రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు జీవన్ కుమార్, వసంత లక్ష్మి, తిరుపతి, గురువయ్య, దశరథ, సులోచన, వెంకటేశ్వరావు, సురేష్‌రావు, వెంకటయ్య, అంజయ్య, ధర్మారావు తదితరులున్నారు.



సింగరాజుపల్లి రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న పాండురంగారావు తదితరులు

క్రిస్టియన్ కౌన్సిల్ చైర్మన్‌గా జాన్‌శాస్త్రి

నల్లగొండ రూరల్ : జిల్లా క్రిస్టియన్ కౌన్సిల్ చైర్మన్‌గా జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు తీగల జాన్‌శాస్త్రిని నియమిస్తూ తెలంగాణ క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డి.రాజేశ్వరరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన మంత్రి జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు భూపాల్ రెడ్డి, కిషోర్‌కు జాన్‌శాస్త్రి కృతజ్ఞతలు తెలిపారు.

భూసేకరణ వేగవంతం చేయాలి

- కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్


నల్లగొండ : జిల్లాలో నీటి పారుదల ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ, నష్ట పరిహారం చెల్లింపు, ఆర్ అండ్ ఆర్ కింద పునరావాస చర్యలు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిండి ఎత్తిపోతల పథకం కింద చేపట్టిన రిజర్వాయర్‌ల నిర్మాణ భూ నిర్వాసితులు, ఏఎమ్మార్పీ ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ, నిర్వాసితులకు పరిహారం చెల్లింపు, పునరావాస చర్యలు ప్రగతిపై స్థానిక సంస్థ అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్ కలిసి భూ సేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌లు, ఇరిగేషన్, రెవెన్యూ, అటవీ, ఇతర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ప్రాజెక్టుల వారీగా సమీక్షించారు. గొట్టిముక్కలలో ముంపునకు గురవుతున్న ప్రభుత్వ భూముల్లో ఉన్న నిర్వాసితులకు పరిహారం చెల్లించాలన్నారు. చింతపల్లి రిజర్వాయర్ నిర్వాసితులకు పరిహారం చెల్లింపునకు ఉద్యాన శాఖ, ఎక్సైజ్, ఆర్అండ్‌బీ, మిషన్ భగీరథ శాఖలు నిర్మాణాలు, చెట్లకు విలువ కట్టి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. శివన్నగూడెం ప్రాజెక్ట్ ముంపు గ్రామాలైన చర్లగూడెం, వెంకపల్లి, వెంకపల్లి తండా నిర్వాసితులకు ఇందుర్తి గ్రామంలో ఆర్ అండ్ ఆర్‌కు పీఎస్ పూర్తి చేసినట్లు తెలిపారు. పెండ్లిపాకల రిజర్వాయర్ కింద ముంపునకు గురయ్యే గుడితండా, హర్యాతండా, కారోబార్‌తండా, పత్యాతండా నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఉదయ సముద్రం రిజర్వాయర్ భూ సేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో స్పెషల్ కలెక్టర్ హరిసింగ్, ఎస్‌డీసీ యూనిట్–2 దామోదర రావు, స్పెషల్ కలెక్టర్ పిఏ.శ్రీదేవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కర్ణన్

103 మంది హెచ్‌ఎంల బదిలీ

- 29 మంది ఇతర జిల్లాలకు..
- ఆప్షన్లు ఇవ్వడంలో లోపంతో ఇద్దరికి ఒక జిల్లాకు బదులుగా మరో జిల్లాకు బదిలీ
- పదోన్నతుల ద్వారా ఖాళీ హెచ్‌ఎం పోస్టుల భర్తీ



నల్లగొండ : ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి ప్రధానోపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తయింది. జిల్లాలో మొత్తం 103 మంది ప్రధానోపాధ్యాయులకు స్థాన చలనం కలిగింది. వారిలో 74 మంది జిల్లాల పరిధిలోనే బదిలీకాగా.. 29 మంది ఇతర జిల్లాలకు వెళ్లారు. ఎనిమిది మంది ఇతర జిల్లాల నుంచి నల్లగొండ జిల్లాకు బదిలీపై వచ్చారు. అయితే ప్రస్తుతం హెచ్‌ఎం పోస్టు మల్టీ జోన్ పరిధిలోకి రావడంతో అంతా హైదరాబాద్, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాలకు బదిలీపై వెళ్లారు. కొందరికి జిల్లాలోనే అనుకున్న చోట బెర్తు దక్కింది. బదిలీలకు సంబంధించిన లిస్టును ఆదివారం ప్రకటించారు. బదిలీ ఉత్తర్వులను సోమవారం అందించడంతో బదిలీ అయిన హెడ్‌మాస్టర్లు అంతా మంగళవారాల్లో విధుల్లో చేరారు. ప్రస్తుతం ఖాళీ అయిన హెచ్‌ఎం పోస్టుల్లో స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు ఇవ్వడం ద్వారా భర్తీ చేయనున్నారు.

కోరుకున్న చోటుకు బదిలీ

ప్రభుత్వం ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీ ప్రక్రియకు సంబంధించి ఇటీవల ఆన్‌లైన్‌లో దరఖాస్తులు తీసుకున్న విషయం తెలిసిందే. మొదటి విడత ప్రధానోపాధ్యాయుల బదిలీలను చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా బదిలీల కోసం ఎదురుచూస్తున్న హెచ్‌ఎంలకు ఎట్టకేలకు బదిలీ అయ్యింది. విద్యాశాఖలో పదవీ విరమణలే తప్ప ఖాళీ పోస్టులను భర్తీ చేయలేదు. ప్రస్తుతం బదిలీలు చేపట్టడంతో జిల్లాలో హెచ్‌ఎం పోస్టులు చాలా వరకు ఖాళీ అయ్యాయి. అందరూ పట్టణాలకు దగ్గరలోని పాఠశాలలను ఎంపిక చేసుకుని కోరుకున్న చోట పోస్టింగ్ దక్కించుకున్నారు.

ఆప్షన్లు తప్పుగా ఇవ్వడంతో..

బదిలీలకు సంబంధించి ఆప్షన్లు తప్పుగా ఇవ్వడంతో ఒక జిల్లాకు బదులుగా మరో జిల్లాకు బదిలీ అయిన సంఘటనలు జిల్లాలో చోటు చేసుకున్నాయి. రంగారెడ్డి జిల్లా నుంచి ఒక హెచ్‌ఎం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లికి బదులుగా పోచంపల్లి అని ఆన్‌లైన్‌లో ఆప్షన్ క్లిక్ చేయడంతో గుర్రంపోడ్ మండలం పోచంపల్లి అని సిస్టం తీసుకుంది. దీంతో ఆమె నల్లగొండ జిల్లాకు బదిలీపై రావాల్సి వచ్చింది. అదే విధంగా నల్లగొండ జిల్లా చింతపల్లికి చెందిన ఒక హెచ్‌ఎం హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు వెళ్లాలనుకోగా.. దానికి బదులుగా వికారాబాద్‌లోని రాజేంద్రనగర్ వెళ్లాల్సి వచ్చింది. దీంతో వారు తాము కోరుకున్న చోటు దక్కకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.



'తగ్గేదేలే'

కొండమల్లేపల్లి మండల కేంద్రంలో అంగన్‌వాడీలు తమ సమ్మెలో భాగంగా మంగళవారం చెవిలో పువ్వుతో ఒంటికాలిపై నిలబడి ఓ సినిమాలో డైలాగ్ మాదిరిగా తగ్గేదేలే అంటూ నిరసన తెలిపారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


శ్రీముక్క రాజు (ఫైల్)

ఆలేరురూరల్ : విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతిచెందాడు. ఆలేరు పట్టణం కాటమయ్యనగర్ కాలనీకి శ్రీముక్క రాజు(20) క్యాటరింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి రాజు ఇంటి స్లాబ్‌పై నుంచి వెళ్తున్న విద్యుత్ సర్వీస్ వైరు తెగింది. ఆ వైరు స్లాబ్‌పైన ఉన్న సీకులపై పడడంతో ఇంటికి మొత్తం విద్యుత్ సరఫరా అవుతోంది. రాత్రి 9గంటలకు ఇంటికి చేరుకున్న రాజు స్నానం చేసి ఇంటి ఇవరణలోని దండెం పైఉన్న టవల్‌ను తీసుకుంటున్నాడు. అప్పటికే ఆ దండేనికి విద్యుత్ సరఫరా అవుతుండడంతో రాజు విద్యుదాఘాతానికి గురై స్పృహ కోల్పోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు ధ్రువీకరించారు. సోమవారం పోలీసులు పంచనామా చేశారు. మృతుడి తండ్రి దశరథ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటశ్రీను తెలిపారు.

స్నేహితుడి వేధింపులకు వివాహిత బలి

ఆత్మకూర్-ఎస్(సూర్యాపేట) : స్నేహితుడి వేధింపులకు వివాహిత బలైంది. సూర్యాపేట జిల్లాలో చోటుచేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూర్(ఎస్) మండలం ఇస్తాళ్లాపురం గ్రామానికి చెందిన మున్న మనీష(23)కు మహబూబాబాద్ జిల్లా దాట్ల గ్రామానికి చెందిన శ్యాంతో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. ఇస్తాళ్ళాపురం గ్రామానికి చెందిన దాసరి వెంకటేష్, మనీష చిన్నతనంలో ఒకే పాఠశాలలో చదువుకున్నారు. ఆ పరిచయంతో అప్పుడప్పుడు ఫోన్‌లో మాట్లాడుకునేవారు. దీని ఆసరాగా తీసుకున్న వెంకటేష్ ఫోన్ రికార్డులు తన దగ్గర ఉన్నాయని కొంత కాలంగా మనీషను వేధిస్తున్నాడు. ఇటీవల కొన్ని ఫొటోలు, ఆడియో రికార్డులను భర్తకు పంపడంతో మనీష మనస్తాపానికి గురైంది. ఈ నేపథ్యంలో మనీష తల్లిగారింటికి వచ్చి సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి పాపమ్మ ఫిర్యాదు మేరకు శ్యామ్‌తో పాటు అతని స్నేహితులు సర్జన్, సురేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పెన్‌పహాడ్ : అక్రమంగా నిల్వ ఉంచిన 20క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు మంగళవారం పట్టుకొని కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెన్‌పహాడ్ మండల పరిధిలోని ధర్మాపురం గ్రామానికి చెందిన పాలిశెట్టి సత్యనారాయణ రేషన్‌కార్డు దారుల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి ఇంట్లో నిల్వచేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేయగా 43బస్తాల్లో 20క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లుగా గుర్తించారు. బియ్యాన్ని సీజ్ చేసి సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

- వాకింగ్ చేస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి
- మరణంలోనూ తోడుగానే..


విష్ణు, స్వప్న (ఫైల్)

నల్లగొండ క్రైం : నల్లగొండ పట్టణ శివారు పానగల్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు దుర్మరణం చెందారు. నీలగిరి మున్సిపాలిటీ పరిధి పానగల్‌కు చెందిన ఓర్సు విష్ణు(34) తన భార్య స్వప్న(29)తో కలిసి బైక్‌పై పానగల్ రిజర్వాయర్ ప్రధాన తూము వద్దకు ఉదయం 5:30 గంటలకు వచ్చాడు. అక్కడ బైక్‌ను పార్క్ చేసి దంపతులిద్దరూ చందనపల్లి వైపు వాకింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో నల్ల గొండ నుంచి నకిరేకల్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం దంపతుల ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో గాయపడిన వారు అక్కడికక్కడే మృతిచెందారు. విష్ణు నల్లగొండలోని ఎన్జీ కాలేజీలో కామర్స్ కాంట్రాక్ట్ అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. గాయపడిన వారిని 108వాహనంలో ఆస్పత్రికి తరలించగా అప్పటి కే మృతిచెందారని వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పక్షం రోజుల తర్వాత వాకింగ్‌కు వెళ్తే..

ఆ దంపతులకు ఇటీవల తీరిక లేకపోవడంతో వాకింగ్‌కు వెళ్లలేదు. 15రోజుల తర్వాత మంగళవారం వాకింగ్‌కు వెళ్లగా ప్రమాదం చోటుచేసుకుందని బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతులకు ఆరేళ్ల కుమారుడు కార్తీక్, రెండేళ్ల కుమార్తె విశిష్ట ఉన్నారు. మృతుడి సోదరుడు పృథ్వీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టుటౌన్ ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కాగా, ఇటీవల ఇదే రోడ్డులో నకిరేకల్ మండలం తాటికల్ వద్ద జరిగిన ప్రమాదంలో నూతన దంపతులు మృతిచెందారు.

వాహనాన్ని ఢీకొని..


సాయిప్రసాద్ (ఫైల్)

చౌటుప్పల్ : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు.నారాయణపురం మండలం చిమిర్యాల గ్రామానికి చెందిన కేసాని స్వామి కొన్నేళ్ల క్రితం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి లక్కారం గ్రామంలో ఇల్లు కొనుగోలు చేసి అక్కడే నివాసం ఉంటున్నారు. ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు సాయిప్రసాద్(21) సోమవారం సాయంత్రం మరో ఇద్దరు స్నేహితులతో కలిసి స్కూటీపై బయటికి వెళ్లాడు. ఇంటికి తిరిగి వస్తూ రాత్రి 10గంటలకు ఎల్లగిరి శివారులో పేదరాశి పెద్దమ్మ హోటల్ ఎదురుగా ముందున్న గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బైకు నడుపుతున్న సాయిప్రసాద్ తలకు గాయాలవ్వడంతో అక్కడికక్కడే మృతిచెందా డు. వెనుక కూర్చున్న అతని స్నేహితులు అభిలాష్, శబరిలకు గాయాలవ్వగా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ దేవేందర్ తెలిపారు.

కారు ఢీకొని మహిళ ..


బక్కమ్మ(ఫైల్)

కేతేపల్లి: కేతేపల్లికి చెందిన వీర బోయిన బక్కమ్మ(44) భర్త పదేళ్ల క్రితమే చనిపోవడంతో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. సోమవారం సూర్యాపేట జిల్లా టేకుమట్ల గ్రామానికి వెళ్లిన బక్కమ్మ అదే రోజు రాత్రి ఆటోలో కేతేపల్లికి చేరుకుంది. ఆటో దిగిన వెంటనే ఇంటికి వెళ్లేందుకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లే దారి సమీపంలో హైవే దాటుతోంది. ఈ క్రమంలో సూర్యాపేట నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రోడ్డుపై దూరంగా ఎగిరిపడిన బక్కమ్మ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. బక్కమ్మకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని కేతేపల్లి ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

వాహనం టైరు మారుస్తుండగా..

ఆలేరురూరల్ : హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన అశ్వినికుమార్ పాండే(30) సోమవారం రాత్రి అశోక్ లీలాండ్ వాహనంలో అల్లం, వెల్లుల్లి బస్తాలు లోడ్ చేసుకొని వరంగల్‌కు బయలుదేరాడు. అర్ధరాత్రి దాటాక 1.30 గంటల సమయంలో వాహనం ఆలేరు శివారులోని బహద్దూర్‌పేట హైవే బ్రిడ్జి వద్దకు చేరుకోగానే టైర్ పంక్చర్ అయింది. దీంతో వాహనాన్ని రోడ్డు ఒకవైపు నిలిపి టైరును మారుస్తున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న కారు అశ్వినికుమార్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కారు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తండ్రి సంతోష్‌పాడే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటశ్రీను తెలిపారు.

మద్యం మత్తులో భార్యను కొట్టి చంపిన భర్త

హుజూర్‌నగర్ : తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి భార్యను చిత్రహింసలకు గురిచేసి కొట్టడంతో మృతిచెందింది. హుజూర్‌నగర్‌లో చోటు చేసుకున్న ఈ ఘటనపై సీఐ రామలింగారెడ్డి, ఎస్‌ఐ హరికష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోదాడ పట్టణానికి చెందిన భవాని రవి, కమల (30) దంపతులు. వారికి ముగ్గురు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు సంతానం. గతంలో హుజూర్‌నగర్‌లో నివాసం ఉన్న వారు ప్రస్తుతం కోదాడలో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. దంపతులిద్దరూ చిత్తు కాగితాలు, పాత ఇనుప సామగ్రి ఏరుకొని జీవిస్తున్నారు. కొన్నేళ్లుగా భర్త రవిత్రాగుడు బానిసై భార్య కమలను కొట్టి వేధిస్తుండేవాడు. దీంతో కమల అలిగి ఇంట్లో నుంచి వెళ్లిపోయేది.

వెతికి పట్టుకొచ్చి చావబాది..

రవి మూడు వారాల క్రితం కమలను కొట్టగా ఆమె ఎవరికీ చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లి పోయింది. ఈ నెల 17వ తేదీ ఆదివారం కమల కోదాడలో ఉన్న విషయం రవి తెలుసుకున్నాడు. పూటుగా మద్యం తాగి అక్కడికి బైక్‌పై వెళ్లి ఆమెను బైక్‌పై ఎక్కించుకొని హుజూర్‌నగర్ పట్టణంలోని పాత వివేకవర్ధిని కాలేజీ వద్దకు వచ్చాడు. అక్కడ ఆమెను బాగా కొట్టగా ఆ దెబ్బలు తాళలేక అక్కడికక్కడే చనిపోయింది. అనంతరం రవి ఆమెను అక్కడే వదిలేసి పారి పోయాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. తల్లి మృతిచెందడం, తండ్రి పరారీలో ఉండడంతో ఐదుగురు పిల్లలు అనాథలుగా మారారు. మృతురాలి సోదరి తురాయి ఆమని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మోసగించిన వ్యక్తి అరెస్ట్

చండూరు : రైతులను మోసగించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. చండూరు మండలం కస్తాల గ్రామానికి చెందిన కట్ట భిక్షం 2016లో కొంత మంది రైతుల వద్ద పత్తి కొనుగోలు చేశాడు. వారికి ఇప్పటి వరకు డబ్బులు చెల్లించలేదు. దీంతో మండలంలోని లక్కినేనిగూడెం గ్రామానికి చెందిన బాధిత రైతు మండలి శ్రీనివాస్ ఇటీవల స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు మంగళవారం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిలించినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

70 ట్రాక్టర్ల ఇసుక కుప్పలు సీజ్

శాలిగౌరారం: మండలంలోని మాధారంకలాన్ గ్రామ సమీపంలో నిల్వ చేసిన ఇసుక డంప్‌లను మంగళవారం ఎస్‌ఐ సతీష్, డిప్యూటీ తహసీల్దార్ సత్తార్ సీజ్ చేశారు. గ్రామ సమీపంలో పత్తిచేనులో ఇసుక అక్రమ రవాణాదారులు ఏర్పాటు ఇసుక డంప్‌లో 70 ట్రాక్టర్ల ఇసుక కుప్పలు ఉన్నట్లు తెలిపారు. పట్టుబడిన ఇసుక కుప్పలను సీజ్ చేసినట్లు వివరించారు. ఇసుక అక్రమ రవాణాపై ప్రజలు అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి బలవన్మరణం


స్వాతి(ఫైల్)

చిట్యాల: ఉరేసుకుని వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. చిట్యాల మండలం బోయగుబ్బ గ్రామానికి చెందిన రెగుల గడ్డ కుమారస్వామికి మనుగోడు మండలం ఊకొండి గ్రామానికి చెందిన స్వాతి(28)తో ఎనిమిదేళ్ల క్రితం వివాహం అయ్యింది. వీరికి ఇద్దరు పిలులన్నారు. కాగా, వీరిద్దరు పిల్లలతో కలిసి కొంత కాలంగా చిట్యాలలోని సంతోష్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. కుమారస్వామి చిట్యాలలోని బార్ అండ్ రెస్టారెంట్‌లో పార్ట్‌నర్‌గా ఉండి విధులు నిర్వహిస్తున్నాడు. స్వాతి మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. సంఘటన స్థలాన్ని నార్కట్‌పల్లి సీఐ మహేష్, చిట్యాల ఎస్‌ఐ రవి పరిశీలించారు. స్వాతి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఘటనపై మంగళవారం రాత్రి వరకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి ఇంటర్ విద్యార్థి..

మాడ్గులపల్లి: పురుగుల మందు తాగి ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. మాడ్గులపల్లి మండలం చిరుమర్తి గ్రామ ఆవాసం జలుబావిగూడేనికి చెందిన ఖాదర్‌పాషా కుమారుడు అమీన్ (17) నల్లగొండలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. సోమవారం ఇంటి నుంచి వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. సమీప రైతులు గమనించేలోపే మృతిచెందాడు. అమీన్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతుడి తండ్రి ఖాదర్‌పాష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఇ.నరేష్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక..

సూర్యాపేట క్రైం : సూర్యాపేట పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌కు చెందిన రౌతుశ్యామ్ ప్రసాద్ (38) స్థానిక అంబేద్కర్ నగర్‌లోని శ్రీ గణేష్ ట్రేడర్స్ దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే దుకాణానికి వెళ్లాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక దుకాణంలోనే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంటున్నా అని భార్య సునితకు వీడియో కాల్ చేసి చెప్పాడు. చెబుతూనే ఉరేసుకొని మృతిచెందాడు. వెంటనే భార్య దుకాణం వద్దకు చేరుకుని పోలీసులకు సమాచారం అందించింది. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి కుమార్తె ఉన్నారు. భార్య సునిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులకు పట్టుబడిన అంతర్రాష్ట్ర దొంగ

- అతనికి సహకరించిన వ్యక్తి కూడా అరెస్ట్
- వివరాలు వెల్లడించిన భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర

భువనగిరి: అంతర్రాష్ట్ర దొంగతో పాటు అతడికి సహకరించిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లెకు చెందిన బీసుపోగు శ్యాంసన్ ఆటో డ్రైవర్‌గా పనిచేసేవాడు. అతడు ఈ నెల 9వ తేదీన హైదరాబాద్‌లోని నల్లకుంటలో బైక్ దొంగిలించి దానిపై బీబీనగర్ మండలంలోని నెమురగోముల, రాఘవపురం గ్రామాలల్లో తాళం వేసిన రెండిళ్లలో చోరీకి పాల్పడ్డాడు. అదేరోజు రాత్రి పోచంపల్లి మండలంలోని ముక్తాపూర్‌లో తాళం వేసిన మరో రెండు ఇళ్ల తాళాలు పగులగొట్టి సొమ్మును అపహరించుకెళ్లాడు. దొంగిలించిన సొమ్మును తనకు తెలిసిన శ్రీనివాస్ అనే వ్యక్తి వద్ద ఉంచాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మంగళవారం పోచంపల్లి మండంలోని జూలూరు గ్రామంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా బైక్‌పై వెళ్తున్న శ్యాంసన్ అనుమానాస్పదంగా కనిపించడంతో అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాలను ఒప్పుకున్నాడు. గతంలో శ్యాంసన్‌పై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలలో 15 కేసులు నమోదైనట్లు డీసీపీ తెలిపారు. శ్యాంసన్‌తో పాటు శ్రీనివాస్‌ను కూడా అరెస్టు చేసి వారి నుంచి 8తులాల బంగారం ఆభరణాలు, 20 తులాల వెండి, రెండు బైకులు, నాలుగు సెలఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో అడిషనల్ డీసీపీ రవికుమార్, చౌటుప్పల్ ఏసీపీ మొగులయ్య, పోచంపల్లి ఎస్‌ఐ విక్రంరెడ్డి పాల్గొన్నారు.

అన్నా.. నీవెంటే నేనూ..

- ఒక్కరోజు వ్యవధిలో అనారోగ్యంతో సోదరులు మృతి
- బీబీగనర్ మండల గూడూరులో విషాదం


శివారెడ్డి(ఫైల్)


యాదిరెడ్డి(ఫైల్)

బీబీనగర్ : అనారోగ్య కారణాలతో బాధపడుతున్న ఇద్దరు సోదరులు రోజు వ్యవధిలో మృతిచెందడంతో బీబీనగర్ మండలం గూడూరులో విషాదం అలుముకుంది. గూడూరు గ్రామానికి చెందిన కొంతం శివారెడ్డి(80) కొంతం యాదిరెడ్డి(60) తమ కుటుంబాలతో కలిసి పక్క పక్క ఇళ్లల్లో నివాసం ఉంటున్నారు. ఇటీవల అన్నదమ్ములు ఇద్దరు అనారోగ్యం బారిన పడి ఇంటి వద్దనే చికిత్స పొందుతున్నారు. ఆదివారం రాత్రి శివారెడ్డి అస్వస్థతకు గురై మృతిచెందాడు. సోమవారం ఉదయం శివారెడ్డి అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతుండగానే సోదరుడు యాదిరెడ్డి సైతం అస్వస్థతకు గురై మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇద్దరి అంత్యక్రియలు ఒకేసారి నిర్వహించారు. రోజు వ్యవధిలో సోదరులు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు రోదనలు మిన్నంటాయి.

చైన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్

- మూడున్నర తులాల బంగారు పుస్తెల తాడు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేష్ చంద్ర

భువనగిరి : చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం తన కార్యాలయంలో భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి కేసు వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లాకు చెందిన బోగి గణేష్, వరంగంటి నవీన్, దేవర రమేష్, బోగి నరేష్ ఫైనాన్స్ వ్యాపారం చేసేవారు. వ్యాపారంలో నష్టం రావడంతో హైదరాబాద్‌కు వెళ్లి ఏదో ఒక పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వచ్చే డబ్బుతో అవసరాలు తీరకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించేందుకు దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా ఈ నెల 2వ తేదీన నలుగురు లాంగ్ డ్రైవ్ యాప్‌లో నంబర్‌లేని కారును బుక్ చేసుకున్నారు. ఆ కారులో హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్తూ మార్గమధ్యలో ముందుగా వెళ్తున్న కారు నంబర్‌ను నోట్ చేసుకున్నారు. అనంతరం ఆ నంబర్ గల ప్లేట్‌ను తయారు చేయించుకుని తమ అద్దెకారుకు ఏర్పాటు చేసుకున్నారు. అదే రోజు వరంగల్‌కు వెళ్లి అక్కడే రాత్రి కారులోనే నిద్రించారు.

మహిళను బెదిరించి..

ముఠా సభ్యులు ఈ నెల 3న ఉదయం 5గంటలకు వరంగల్ నుంచి జాఫర్‌ఘడ్, తిరుమలగిరి మీదుగా హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ సమయంలో బోగి నరేష్ కారు నడుపుతున్నాడు. వలిగొండ మండలం వర్కట్‌పల్లి గ్రామ శివారుకు చేరుకోగానే రోడ్డు మీదుగా ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న మహిళను గమనించారు. సమీపంలోకి వెళ్లి ఆమెను పట్టుకుని, కేకలు వేయకుండా నోరు మూశారు. అరిస్తే చంపుతామని బెదిరించి మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు పుస్తెల తాడు తీసుకుని, వాటికి ఉన్న రెండు పుస్తెలను ఆమెకి ఇచ్చి అక్కడి నుంచి పారిపోయారు. బాధిత మహిళ వలిగొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మరోసారి చైన్ స్నాచింగ్‌కు వెళ్తూ..

ముఠా సభ్యులు మంగళవారం ఉదయం 5 గంటల సమయంలో చైన్ స్నాచింగ్ పాల్పడేందుకు మేడిపల్లిలోని లాంగ్‌డ్రైవ్ సెంటర్‌కి వెళ్లి కారు అద్దెకు తీసుకున్నారు. అనంతరం హైదరాబాద్ నుంచి భువనగిరి మీదుగా చిట్యాలకు నంబర్ ప్లేట్ లేకుండా వెళ్తున్నారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు వలిగొండ మండలం నాగారం గ్రామం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో నంబర్ ప్లేట్ లేకుండా వెళ్తున్న వాహనాన్ని నిలిపారు. అనుమానంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. వారి వద్ద నుంచి 33గ్రాముల పుస్తెలతాడు, 5మొబైల్ ఫోన్లు, కారు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ రవికుమార్, చౌటుప్పల్ ఏసీపీ మొగులయ్య, రామన్నపేట సీఐ మోతీరాం, వలిగొండ ఎస్ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో తనిఖీలు


నార్కట్‌పల్లిలో పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

నార్కట్‌పల్లి : మండలంలోని ఎల్లారెడ్డిగూడెం, చెరువుగట్టు, నార్కట్‌పల్లిలో గల హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్, ఎస్ఆర్ బంక్‌లను మంగళవారం డీసీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, లీగల్ మెట్రోలజీ నల్లగొండ అధికారి రామకృష్ణ, సివిల్ సప్లయీస్ సిబ్బంది ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బంక్‌లో స్టాక్, సేల్స్ రికార్డులు పరిశీలించారు. వాహనదారులకు పెట్రోలు, డీజిల్ స్టాక్ ఉండేలా చర్యలు తీసుకోవాలని బంక్ యజమానులకు సూచించారు. కొలతల్లో తేడాలొస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అన్నివర్గాలకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి


అడవిదేవులపల్లి: గిరిజనులకు చెక్కులు పంపిణీ చేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు

అడవిదేవులపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేస్తూ అండగా ఉంటుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం అడవిదేవులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జెడ్పీ నిధులు రూ.5లక్షలతో చేపట్టిన ఆర్చ్, ప్రహరీ నిర్మాణానికి మిర్యాలగూడ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు, రాష్ట్ర గిరిజన సహకార ఆర్థిక అభివృద్ధి సంస్థ చైర్మన్ ఇస్లావత్ రామచందర్‌నాయక్‌తో కలిసి గుత్తా సుఖేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం మాడా-ట్రైకార్ పథకం కింద మండలంలోని 74 మంది గిరిజనులకు మంజూరైన రూ.91.25లక్షల విలువైన చెక్కులతో పాటు 70మంది రైతులకు ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే భాస్కర్‌రావు పట్టుబట్టి మరీ రూ.300కోట్లతో కృష్ణపట్టి రైతులు చిరకాల కోరిక అయినటువంటి దున్నపోతుల గండి-చిట్యాల ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేయించారని అన్నారు. పనులు కూడా ముమ్మరంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్, జెడ్పీటీసీ సేవ్యానాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కూరాకుల చిన రామయ్య, స్థానిక సర్పంచ్ కొత్త మర్రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీనునాయక్, ఎంపీటీసీలు కుర్ర కాంతి కృష్ణకాంత్‌నాయక్, పేర్ల లింగయ్య, మండల రైతు బంధు అధ్యక్షుడు సూర్యానాయక్, కోఆప్షన్ సభ్యుడు బాబుజానీ, మండల యువజన విభాగం అధ్యక్షుడు అశోక్‌నాయక్, సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణపై ప్రధాని విషం చిమ్మారు

నల్లగొండ : ప్రధాని మోదీ తెలంగాణపై విషయం చిమ్ముతున్నాడని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ తలుపులు పెట్టి.. తెలంగాణ ఇచ్చారని గతంలో అన్నాడని, తెలంగాణలో ఆనాడు రక్తపుటేర్లు పారాయని అనడం అర్థరహితం అని అన్నారు. ప్రధాని గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సందర్భంలో పారిన రక్తపుటేరు సంఘటనలు ఇంకా మరిచిపోనట్లు ఉందని సుఖేందర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మంగళవారం నల్లగొండలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆనాడు వాజ్‌పేయ్ నాయకత్వంలో బీజేపీ మూడు రాష్ట్రాలు ఇచ్చిన సమయంలో తెలంగాణ రాష్ట్రాన్ని కూడా ఇస్తే ఎవరూ చనిపోయేవారు కాదన్నారు. కేసీఆర్ అలుపెరుగని పోరాటం ఫలితంగానే కేంద్రం దిగి వచ్చి తెలంగాణ ఇచ్చిందని, ప్రజల ఒత్తిడి మేరకు తెలంగాణ ఏర్పాటు అయిందని అన్నారు. మోదీ మాట్లాడే దాంట్లో అర్థం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్యపెట్టేలా హామీలు ఇస్తుందని సుఖేందర్‌రెడ్డి విమర్శించారు. 6 గ్యారంటీ హామీలు ఉత్తివేనని, వారు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఏది చేయాలన్నా ముఖ్యమంత్రి కేసీఆర్ వల్లనే సాధ్యమవుతుంది, అది తెలంగాణ ప్రజలకు తెలుసు అని అన్నారు. కాంగ్రెస్‌కు విజన్ లేదన్నారు. గ్యారంటీ హామీల్లో రూ.2 లక్షల రుణమాఫీని ఎందుకు మర్చిపోయారని ప్రశ్నించారు. తెలంగాణ కోసం రాజీనామా చేయమంటే పారిపోయిన వ్యక్తి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అని అన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టడం బీజేపీ పని అని, బీజేపీ పతనం ప్రారంభం అయింది.. అందుకే మళ్లీ మహిళా రిజర్వేషన్ బిల్లు అంటూ హడావుడి చేస్తున్నారని అన్నారు. మహిళా బిల్లుతోపాటు ఓబీసీ బిల్లు కూడా ఆమోదించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ
- ప్రైవేట్ ఆస్పత్రిపై దాడి.. ఫర్నిచర్ ధ్వంసం


రోదిస్తున్న మృతుడి బంధువులు


ఆందోళకారులతో మాట్లాడుతున్న పోలీసులు

నల్లగొండ టౌన్ : నల్లగొండ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం మృతిచెందాడు. అతడి మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ బంధువులు ఆస్పత్రిపై దాడి చేసి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. మృతుడి బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామానికి చెందిన లింగయ్య(55) జ్వరంతో బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు అతడిని సోమవారం ఉదయం నల్లగొండలోని ప్రకాశం బజార్‌లో గల సంకల్ప ఆస్పత్రిలో చేర్పించారు. లింగయ్య మంగళవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో పరిస్థితి విషమించి చనిపోయాడు. దీంతో బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వైద్యులు సరైన చికిత్స అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. అనవరమైన ఇంజక్షన్లు, ట్యాబ్లెట్‌లు ఇచ్చినందు వలనే చనిపోయాడని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆస్పత్రిలో ఫర్నిచర్‌ను ధ్వంసం చేసి సిబ్బందిపై చేయిచేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి వారికి సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని చెప్పడంతో శాంతించారు.

గుండెపోటుతో మృతిచెందాడు - ఆస్పత్రి వైద్యులు


మాట్లాడుతున్న ఆస్పత్రి వైద్యులు

లింగయ్యకు చికిత్స విషయంలో తమ నిర్లక్ష్యమేమీ లేదు. రోగుల ప్రాణాలు కాపాడడమే మాకు ముఖ్యం. లింగయ్యకు ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో పాటు టీబీ కూడా ఉంది. అతడిని ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్న సమయంలో అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మృతిచెందాడు.